సాక్షి కర్నూలు

బుధవారం ; 18 ; జూన్ ; 2025



ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె: నందవరంలో వెలిసిన చౌడేశ్వరి దేవి ఆలయాభివృద్ధికి అదే గ్రామానికి చెందిన మంగలి రామసుబ్బన్న మంగళవారం రూ.లక్ష విరాళం ఇచ్చారు.



కన్నీటి కష్టాలు

ఏ మారుమూల పల్లెనో కాదు.. ఎడారి ప్రాంతం అంతకన్నా కాదు.. తుంగభద్ర పరవళ్లు తొక్కుతున్న చోట.. తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,606.28
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 30.692
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 14,800
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 160

న్యూస్‌రీల్

ఐదుగురికి కారుణ్య నియామకాలు



పోస్టింగ్ ఉత్తర్వులను అందచేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కారుణ్య నియామకాల్లో భాగంగా ఐదుగురికి జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ శాఖల్లో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఇటీవల కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లా ట్రెజరీకి కేటాయించిన సరితారాణి, షెన్వాజ్, ప్రభావతి, శ్వేతప్రియ, గంగాధర్‌లకు పోస్టింగ్ ఉత్తర్వులను అందచేశారు. వీరిని జూనియర్ అకౌంటెంట్లుగా నియమించారు. గంగాధర్‌ను నంద్యాల జిల్లా ట్రెజరీకి కేటాయించగా.. మిగిలిన నలుగురికి కర్నూలు జిల్లా ట్రెజరీలోనే జూనియర్ అకౌంటెంట్లుగా నియమించారు. కార్యక్రమంలో ఎస్టీవో కరుణాకర్ కూడా పాల్గొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు (హాస్పిటల్): బీఎస్సీ నర్సింగ్ కోర్సులో చేరదలుచుకున్న విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ ఇన్‌స్టిట్యూషన్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్వహించే ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ కామన్ కంట్రెన్స్ టెస్ట్ (ఏపీఎన్‌సీఈటీ–2025) పరీక్షలో తప్పక పాల్గొనాలన్నారు. ఈ పరీక్షకు సంబంధించిన వివరాలు https:// apuhs& ncet& aptonline. in/ NCET/ Homeలో పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08518–229134, 9490526342ను సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆలూరు రూరల్: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు సీజ్ చేశారు. ఆలూరు ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపిన వివరాల మేరకు.. కరిగుడ్డం గ్రామం వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేయగా ఆదోనికి చెందిన బొలెరో వాహనం డ్రైవర్ షేక్షావలిని అదుపులో తీసుకోగా.. క్లీనర్ ఇంగప్ప పరారయ్యాడు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని, 34 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనాన్ని సీజ్ చేశామన్నారు. రైస్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించి స్థానిక సివిల్ సప్లయ్ గోదాములో భద్రపరిచామని ఎస్‌ఐ వెల్లడించారు.

శ్రీశైలంలో 68.5 టీఎంసీలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 68.5660 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 844.20 అడుగులకు చేరుకుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు ఎగువ జూరాల, తుంగభద్రల నుంచి 39,088 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి నాగార్జునసాగర్‌కు 8,714 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,326 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 3.990 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.



సేవలు.. కోతలు

ఎన్నికలకు ముందు చంద్రబాబు

మా ప్రభుత్వం ఏర్పాటయితే విద్యుత్ చార్జీలను ఎలాంటి పరిస్థితుల్లో పెంచం. పైగా చార్జీలను తగ్గిస్తాం. స్మార్ట్ మీటర్లను బిగించే ప్రసక్తే లేదు.

ఎన్నికలయ్యాక చంద్రబాబు

విద్యుత్ బిల్లులను చూస్తే వినియోగదారుల ఫ్యూజులు ఎగిరిపోతున్నాయి. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ముమ్మరంగా సాగుతోంది. సర్దుబాటు పేరిట వినియోగదారులకు ప్రతినెలా షాక్ తగులుతోంది.

కర్నూలు జిల్లా

రోజువారీ విద్యుత్ వినియోగం కోటా 8.790 మిలియన్ యూనిట్‌లు. అయితే ఈనెల 1న 8.297, 2న 8.219, 3న 8.473, 9న 7.792 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు కోటా 79.11 మిలియన్ యూనిట్లు కాగా 76.41 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు.

నంద్యాల జిల్లా

రోజువారీ విద్యుత్ వినియోగం కోటా 6.973 మిలియన్ యూనిట్‌లు. అయితే ఈనెల 1న 6.051, 2న 6.157, 3న 5.820, 9న 5.864 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు. ఈ నెల 1 నుంచి 9వ తేదీ వరకు కోటా 62.76 మిలియన్ యూనిట్లు కాగా 53.70 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగించారు.

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ 10 వరకు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు

నెల	కర్నూలు జిల్లా	నంద్యాల జిల్లా
ఏప్రిల్	239	155
మే	604	326
జూన్ 10 వరకు	207	149
మొత్తం	1,050	630

కోటా కంటే ఎక్కువ విద్యుత్ వినియోగం ఉన్నప్పుడు కోతలు విధిస్తున్నారంటే అర్థం ఉంది. అలాంటిది కోటా కంటే తక్కువగానే విద్యుత్ వినియోగం ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు కనీసం 4 గంటల పాటు అనధికార కోతలు విధిస్తుండటం గమనార్హం.

గాడితప్పిన విద్యుత్ శాఖ

- గ్రామీణ ప్రాంతాల్లో అడ్డగోలుగా అనధికార కోతలు
- ప్రతి రోజూ రెండు మూడు దఫాలుగా 4 గంటల పవర్ కట్
- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఏర్పాటులో తీవ్ర జాప్యం
- గ్రామీణ ప్రాంతాల్లో 72 గంటలు, అర్బన్ ప్రాంతాల్లో 48 గంటల నిరీక్షణ
- ఇప్పటికే సర్దుబాటు పేరిట ఎడాపెడా విద్యుత్ చార్జీలు
- 'స్మార్ట్' మీటర్ల ఏర్పాటుతో పెరగనున్న భారం

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఏర్పాటై సరిగ్గా ఏడాది గడుస్తోంది. సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై అడ్డగోలుగా భారం మోపడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లో వారం రోజులకు పైగా సమయం తీసుకుంటుండటంతో ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులు, పారిశ్రామికవేత్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాకు ఇచ్చిన కోటా కంటే విద్యుత్ వినియోగం తక్కువగానే ఉన్నప్పటికీ గ్రామీణ ప్రజలకు అనధికార కోతలు తప్పడం లేదు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందని పండు చందంగా మారింది. పగటి పూటనే 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా.. కనీసం 7 గంటలు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొంది. రాత్రి పూట వ్యవసాయ విద్యుత్ కారణంగా అక్కడక్కడ రైతులు ప్రమాదాల బారిన పడుతుండటం గమనార్హం.



కౌతాళం మండలంలో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

'స్మార్ట్' షాక్..

వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను చంద్ర బాబు, ఆయన తనయుడు లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగులకొట్టాలని పిలుపు నిచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అవే స్మార్ట్ మీటర్లు ముద్దయ్యాయి. ఇప్పటికే పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించేశారు. ఈ కారణంగా అంతకుముందు రూ.3వేల వరకు వచ్చే బిల్లు ఇప్పుడు రూ.30వేలకు చేరుకుంది. తాజాగా 200 యూనిట్లకు పైబడి విద్యుత్ వినియోగం ఉన్న ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియ సాగుతుండటం గమనార్హం. 2023 సంవత్సరంలో రూ.600 ప్రకారం వచ్చే బిల్లు 2025లో రూ.1000 పైగా వస్తోంది. ప్రతి వినియోగదారుడిపై సర్దుబాటు చార్జీల భారం పడుతోంది. ఇక స్మార్ట్ షాక్ ఏస్థాయిలో ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే అ'ధన'పు భారం

ఈ వేసవిలో గతంలో ఎప్పుడూ లేని విధంగా 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. కర్నూలు జిల్లాలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 10,380, త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 56,188 ఉన్నాయి. నంద్యాల జిల్లాలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 7,600, త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 45వేలు ఉన్నాయి. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, ఉరుములు, పిడుగుపాటు ఘటనలతో ఎప్పుడూ లేని విధంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ఏప్రిల్ నుంచి జూన్ నెల 10వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో 1,050, నంద్యాల జిల్లాలో 630 ట్రాన్స్‌ఫార్మరు కాలిపోవడం గమనార్హం. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినప్పుడు అర్బన్ ప్రాంతాల్లో అయితే 12 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల్లోగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు అమర్చాలి. అప్పుడే రైతులు పంటలు దెబ్బతినకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. ట్రాన్స్‌ఫార్మర్ ట్రాన్స్‌పోర్టు ఖర్చు కూడా విద్యుత్ శాఖదే. అయితే నిర్ణీత సమయం ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దాఖలాల్లేవు. పైగా ట్రాన్స్‌పోర్టు ఖర్చులను సైతం రైతుల నెత్తినే వేస్తున్నారు. డిపార్టుమెంట్ వాహనంలోనే తరలిస్తూ వేలాది రూపాయలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ అస్తవ్యస్తం



బోరు కింద మూడు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాం. వ్యవసాయ విద్యుత్ అస్తవ్యస్తంగా ఉంది. త్రీఫేజ్ విద్యుత్ ఇచ్చినట్లే ఇచ్చి తరచూ నిలిపేస్తున్నారు. ఇలా నిలిపేస్తుండటంతో 2 గంటల వరకు విద్యుత్ వృథా అవుతోంది. తొమ్మిది గంటలు ఇస్తున్నామని చెబుతున్నా రెండు, మూడుసార్లు నిలిపేస్తుండటంతో వ్యవసాయ పనులు సాగని పరిస్థితి. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కొత్తది పెట్టడానికి ఐదారు రోజులవుతోంది.

– ఊలూరు మల్లయ్య, హొళగుంద

అనధికార విద్యుత్ కోతలతో అవస్థలు



ప్రతిరోజూ రెండు మూడు గంటల చొప్పున అనధికార విద్యుత్ కోతలు విధిస్తున్నారు. గాలులు వీచినా, వర్షాలు కురుస్తాయనుకున్న సమయంలో విద్యుత్ కోతలు మరింత అధికం. పవర్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. ఆఫీసులకు ఫోన్ కాల్స్ చేసి విసిగిపోవాల్సిందే. అసలే వర్షాకాలం, ఆపై విద్యుత్ కోతలతో చిన్న పిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం.

– బషీర్, మూలసాగరం, నంద్యాల



జీవన 'యోగ'ం

ఆరోగ్యమే మహా భాగ్యం.. అది యోగాతోనే సాధ్యమంటూ మంగళవారం కర్నూలు నగరంలోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో భారీ ఎత్తున యోగా ప్రదర్శన చేపట్టారు. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు సిటీ: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పదవ తరగతి, ఇంటర్మీడియెట్ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్ల నిండిన వారు పదిలో, పది పాసై 15 ఏళ్ల వయస్సు నిండిన వారికి ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ పొందేందుకు అర్హులన్నారు. www. apopenschool. ap. gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. చదువు మధ్యలో నిలిపి వేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గందరగోళంగా బదిలీల కౌన్సెలింగ్

- వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా, జోనల్ స్థాయిల్లో బదిలీలు
- జూమ్ ద్వారా నిర్వహించడంతో సాంకేతిక లోపాలు
- ఆందోళనకు గురైన ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో మంగళవారం ప్రారంభమైన బదిలీల కౌన్సెలింగ్ గందరగోళానికి దారి తీసింది. జిల్లాస్థాయిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్–2, డ్రైవర్స్, పురుష ఆరోగ్య కార్యకర్తలు, మధ్యాహ్నం 2 గంటలకు మహిళా ఆరోగ్య కార్యకర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాస్థాయిలో ఎవరికి వారు పనిచేసే పీహెచ్‌సీల్లో ఉండి జూమ్ ద్వారా కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో బదిలీకి అర్హులైన ఉద్యోగులతో పాటు ఇతరులు సైతం జూమ్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. దీంతో చాలామంది ఉద్యోగులకు జూమ్ కనెక్ట్ కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కాగా పదేళ్లకు పైబడి పనిచేస్తున్నా కొందరు ఉద్యోగులను అధికారులు బదిలీల నుంచి రిటైన్ చేయడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ విషయమై సి.బెళగల్‌కు చెందిన ఓ ల్యాబ్ టెక్నీషియన్ జూమ్‌లోనే అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం.



జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ



వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జోనల్ స్థాయి కౌన్సెలింగ్‌కు ఎదురుచూస్తున్న ఉద్యోగులు

జోనల్ స్థాయి గందరగోళం

వైఎస్సార్ కడపలోని ప్రాంతీయ కార్యాలయం కేంద్రంగా ఆర్‌డీ డాక్టర్ రామగిడ్డయ్య జోనల్ స్థాయి బదిలీ కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. అయితే కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని క్షయ నివారణ కేంద్రంలో సాయంత్రం వరకు ఈ కౌన్సెలింగ్ ప్రక్రియకు జూమ్ ద్వారా అవకాశం కల్పించారు. సాయంత్రం 5 దాటిన తర్వాత పనివేళలు ముగిశాయని, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి వెళ్లి అక్కడ జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఉద్యోగులకు అధికారులు చెప్పి పంపించారు. ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు తావిచ్చింది. కార్యాలయంలోని ఓ చిన్న గదిలో ల్యాప్‌టాప్‌ను ఏర్పాటు చేసి జూమ్ ద్వారా కౌన్సెలింగ్ చేపట్టి మమ అనిపించారు. కాగా జోనల్ స్థాయి కౌన్సెలింగ్‌లోనూ పలువురు ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు (రిటైన్) ఇవ్వడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ మేరకు సాయంత్రం పలువురు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టులు, వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. అధికారులు వచ్చి తమకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేయగా జోనల్ స్థాయి బదిలీలు ఆర్‌డీ పరిధిలో జరుగుతాయని, తమకు సంబంధం లేదని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమాధానం ఇచ్చి పంపించారు. దీంతో రాత్రి పొద్దుపోయే వరకు హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ కొనసాగింది.

'చీకటి' ఒప్పందం.. బియ్యం మాయం!



శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయం. సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ మహేష్ నాయుడు ఓ గోడౌన్ వద్దకు చేరుకున్నారు. అజ్ఞాత వ్యక్తుల సమాచారంతో ఆయన మెరుపుదాడులు చేపట్టారు. అప్పటికప్పుడు స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వడం, పోలీసులతో సహా అక్కడికి చేరుకోవడం చకచకా జరిగిపోయింది. తాళం తెరిపించి చూస్తే ఏకంగా 1,500కి పైగా రేషన్ బియ్యం బస్తాలు కనిపించాయి.



శనివారం ఉదయం. తిరిగి అదే గోడౌన్. సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ రెవెన్యూ, పోలీసుల సమక్షంలో వేయించిన తాళం అలాగే ఉంది. రాత్రి వెలుగుచూసిన బియ్యం బస్తాలను లెక్కించి కేసు నమోదు దిశగా చర్యలు చేపట్టాలనేది ఆయన ఆలోచన. డిప్యూటీ తహసీల్దార్ బాబు, పోలీసుల సమక్షంలో తాళం తెరిచి చూడగా గోడౌన్ దాదాపుగా ఖాళీ అయ్యింది. 109 బస్తాలు మాత్రమే కనిపించాయి.

చర్చనీయాంశంగా టీడీపీ ముఖ్యనేత ఫోన్‌కాల్

- గత శుక్రవారం అర్ధరాత్రి సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ దాడులు
- గోదాములో పట్టుబడిన 1,500 బస్తాలు రాత్రికి రాత్రే మాయం
- శనివారం ఉదయానికి 109 బస్తాలే గుర్తింపు
- అర్ధరాత్రి గోడౌన్ వద్దకు ముఖ్యనేత కుమారుడు, మరికొందరు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఆదోని రేషన్ బియ్యం దందాలో కొత్త కోణం వెలుగు చూస్తోంది. కూటమిలోని రెండు వర్గాలు పక్కా ప్రణాళికతో ఈ దందా సాగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ప్రభుత్వంలో బీజేపీ, టీడీపీ భాగస్వామ్య పార్టీలే అయినా, ఆదోని నియోజకవర్గంలో ఈ రెండు పార్టీలకు చెందిన నాయకుల మధ్య కుమ్ములాట జరుగుతోంది. ఎమ్మెల్యే బీజేపీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు కూటమిలోని ప్రధాన పక్షం టీడీపీలో సీనియర్ నేత. 'కూటమి' అధికారంలోకి వచ్చిన తర్వాత వీరి మధ్య పలు సందర్భాల్లో పలు అంశాల్లో విభేదాలు పొడచూపాయి. ఎమ్మెల్యే పార్థసారథిపై మీనాక్షినాయుడు, ఆయనపై పార్థసారథి పలుసార్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా విమర్శలు చేసుకున్నారు. ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో కూడా రభస చోటు చేసుకుంది. ఎట్టకేలకు ఉన్నతస్థాయి జోక్యంతో రెండు వర్గాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. అయితే ఇది ఆదాయ వనరులు దెబ్బతిననంత వరకేనని సమాచారం. ఇందులో భాగంగానే టీడీపీ నుంచి ఓ నేత కుమారుడు, బీజేపీ నుంచి ఓ నేత కుమారునికి రేషన్ బియ్యం దందా బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. వీరిద్దరి కనుసన్నల్లోనే బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. రాష్ట్రంలోని చాలా జిల్లాల నుంచి రేషన్ బియ్యం కర్ణాటకకు తరలిపోతోంది. ఆదోని కర్ణాటక సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ బియ్యం దందా మరింత ఊపందుకుంది. ఈ నెల 13న ఆదోనిలో పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేసి సీజ్ చేసిన బియ్యం వ్యవహారంలో ఈ విషయాలు వెలుగు చూస్తున్నాయి. తమకు అందిన సమాచారం మేరకు వైఎస్సార్‌సీపీ వర్గీయులకు చెందిన గోడౌన్‌గా భావించి సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరక్టర్ మహేష్ నాయుడు రాత్రి 10.30 గంటలకు శిరుగుప్ప రోడ్డులో ఉన్న ఓ గోడౌన్‌ను తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, రెవెన్యూ అధికారులు, పోలీసులు కూడా దాడుల్లో పాల్గొన్నారు. గోడౌన్‌లోని 1,500కు పైగా రేషన్ బియ్యం పట్టుబడింది. రాత్రి పొద్దుపోవడంతో ఉదయం పంచనామా చేసి కేసు నమోదు చేయిద్దామని డైరెక్టర్ భావించారు.

వేసిన తాళం వేసినట్లే..

గోడౌన్‌కు తాళం వేయించింది సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్. అప్పటికి సమయం శుక్రవారం అర్ధరాత్రి సుమారు 12 గంటలకు పైనే. పోలీసుల సమక్షంలో, వీఆర్వో తాళం వేసి తన వద్దే ఉంచుకున్నాడు. శనివారం ఉదయం డైరెక్టర్‌తో పాటు రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారే స్వయంగా తాళం తెరిచారు. తీరాచూస్తే బియ్యం బస్తాలు మాయమయ్యాయి. 1,500కు పైగా బస్తాలు ఉండాల్సిన స్థానంలో 109 మాత్రమే మిగిలాయి. తనిఖీ సమయంలో మీడియా తీసిన ఫొటోల్లో 1,500కు పైగా బస్తాలు కనిపించాయి. మరి ఎలా మాయమయ్యాయి? అంటే సమాధానం కరువైంది. ఎప్పటిలానే కూటమి నేతలను కాపాడుకునేందుకు 'పచ్చ' పత్రికలు వైఎస్సార్‌సీపీపై రాళ్లు వేయడంతో సరిపెట్టాయి. తాళం వేయించింది, తీయించింది.. అంతా వాళ్లే అయినప్పుడు, బియ్యం వాళ్లకు తెలియకుండానే మాయమవడం గమనార్హం.



శుక్రవారం అర్ధరాత్రి గోదాముకు తాళం వేయిస్తున్న సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్‌నాయుడు

ముఖ్య నేతల కుమారుల హస్తం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో పేదలకు బియ్యాన్ని అందిస్తున్నాయి. అయితే ఆ బియ్యంతోనే ఆదోనిలో టీడీపీ నాయకులు అక్రమ దందా సాగిస్తున్నారు. సమీపంలోని కర్ణాటక బార్డర్ దాటించి కోట్లు కొల్లగొడుతున్నారు. ఆదోని టీడీపీలో రెండు వర్గాలు ఉన్నాయి. అందులో ఒక వర్గం నేత కుమారుడు ఆదోని పట్టణం, మరో వర్గంనేత కుమారుడు ఆదోనిరూరల్ ఏరియాలో బియ్యం దందా చేస్తున్నారు. వీరిని నిలువరించే వాళ్లు లేకపోవడంతో బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. దీంతో వారు రెచ్చిపోతూ ఒకరికొకరు పోటీ పడి మరీ అక్రమ బియ్యం దందాను సాగిస్తున్నారు.

అర్ధరాత్రి ముఖ్య నేత ఫోన్‌కాల్.. రంగంలోకి కుమారుడు!

సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ మహేష్‌నాయుడు గోడౌన్ తనిఖీకి వెళ్లగానే ఆదోనికి చెందిన టీడీపీ ముఖ్య నేత ఒకరు ఫోన్ చేసినట్లు తెలిసింది. 1,500కు పైగా బియ్యం బస్తాలు పట్టుబడినట్లు తెలుసుకొని తనకేమీ సంబంధం లేదని తప్పుకున్నట్లు సమాచారం. ఆ వెంటనే ముఖ్యనేత కుమారుడు అక్కడికి చేరుకోవడం, తన తండ్రికి తెలియదని.. చూసీచూడనట్లుగా వదిలేయాలని డైరెక్టర్‌తో 'పచ్చ' సంబంధం కలిపినట్లు చర్చ జరుగుతోంది. ఇంతలో ఓ కౌన్సిలర్ అక్కడికి చేరుకోవడం, అతనితో పాటు ఓ కుల సంఘం నాయకుడు, మరికొందరు తమ్ముళ్ల రాకతో గందరగోళ పరిస్థితి నెలకొన్నట్లు తెలిసింది. ఒకానొక సమయంలో మేము కూడా టీడీపీనే అని, ఇప్పుడు కూడా సంపాదించుకునేందుకు అడ్డు తగిలితే ఎలాగని డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం.

క్లుప్తంగా

ఆప్కో- లేపాక్షి ఆధ్వర్యంలో డిజైన్ పోటీలు

కర్నూలు(అగ్రికల్చర్): హస్తకళల ఉత్పత్తుల్లో సృజనాత్మకతను, నూతనత్వాన్ని ప్రోత్సహించేందుకు ఆప్కో-లేపాక్షి ఆధ్వర్యంలో సావనీర్ డిజైన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు కర్నూలు లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియం మేనేజర్ తిమ్మయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల పైబడిన హస్తకళాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు అర్హులన్నారు. కళాకారులు, నేత కార్మికులు, డిజైనర్ లేదా సంస్కృతి, చేతిపనుల పట్ల మక్కువ కలిగి సృజనాత్మకత ఔత్సాహికులు డిజైన్ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. తమ డిజైన్‌లను సమర్పించేందుకు జూలై 16 వరకు అవకాశం ఉందని, తమ డిజైన్‌లను ఆప్కో షోరూంలు, లేపాక్షి హాండీ క్రాఫ్ట్ ఎంపోరియంలో అందచేయవచ్చని తెలిపారు. పోటీల్లో నిలిచిన డిజైన్‌లకు రూ.5 లక్షల వరకు బహుమతులు ఉంటాయన్నారు.

53 మంది రైతులకు 13.40లక్షల పరిహారం

కర్నూలు(సెంట్రల్): 2014లో గురురాఘవేంద్ర పథకంలో భాగమైన చిలకలడోణ రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపడంతో సమీపంలోని రైతుల పొలాలు నీట మునిగి పంటలకు తీవ్ర నష్టం కలిగింది. కేవలం అధికారుల తప్పిదంతోనే తమపంటలు నీట మునిగాయని ఎకారకు రూ.20వేల పరిహారం చెల్లించాలని ఆర్.రాఘవరెడ్డి అనే రైతు లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్, జలవనరుల శాఖ ఇంజినీర్ల నుంచి పలు నివేదికలు తెప్పించుకున్న తరువాత 53 మంది రైతులకు రూ.13,40,740 పరిహారాన్ని మంజూరు చేస్తూ మంగళవారం ఉపలోకాయుక్త పి.రజని ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో ఫిర్యాదుదారుడు సహా 26 మంది పరిహారం అందుకోగా.. మిగిలిన వారు వలస వెళ్లడంతో వచ్చిన తరువాత అందజేయాలని ఆమె జిల్లా కలెక్టర్, జలవనరుల శాఖ ఇంజినీర్లను ఆదేశించారు.

అనాథ పిల్లల కోసం స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి

కర్నూలు(అర్బన్): ఆధార్‌కార్డు లేని అనాథ పిల్లల కోసం సాథీ కమిటీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు స్త్రీ శిశు సంక్షేమం సాధికారత అధికారిణి పి.నిర్మల, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ టి.శారద తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి ఆదేశాల మేరకు మంగళవారం వెంకటరమణ కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో 22 మంది ఆధార్‌కార్డు లేని పిల్లలను గుర్తించామన్నారు. వీరందరిని స్థానిక న్యాయ సేవాసదన్‌లో సాథీ కమిటీ చైర్మన్ లీలా వెంకటశేషాద్రి ఎదుట హాజరు పరిచామన్నారు. వీరిలో ఒకటి నుంచి ఐదేళ్ల వయస్సు కలిగిన బాలికలను వారి చదువు, ఉజ్వల భవిష్యత్తు కోసం పెద్దపాడులోని బాలసదన్‌లో, బాలురను జి పుల్లారెడ్డి కాలేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని విజ్ఞానపీఠంలో చేర్పించాలన్నారు. వారందరికీ మెరుగైన విద్యను అందించడంతో పాటు ఆధార్‌కార్డులు ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు.

కన్నీటి కష్టాలు

- కౌతాళంలో 15 రోజులకోసారి తాగునీటి సరఫరా
- నిండుకుండలా ఎస్ఎస్ ట్యాంక్ ఉన్నా తీరని దాహం
- చేష్టలుడిగిన అధికారులు



నిండుకుండలా ఉన్న ఎస్ఎస్ ట్యాంక్

ఏ మారుమూల పల్లెనో కాదు.. ఎడారి ప్రాంతం అంతకన్నా కాదు.. తుంగభద్ర పరవళ్లు తొక్కుతున్న చోట.. ఎస్ఎస్ ట్యాంక్ నిండుకుండను తలపిస్తున్న కౌతాళం మండల కేంద్రంలో.. అదికూడా వర్షాలు పడుతున్న సమయంలో ప్రజలు గొంతు తడవక అల్లాడిపోతున్నారు. పదిహేను రోజులకోసారి సరఫరా అవుతున్న నీటిని ఎంత పొదుపు చేసుకున్నా చాలడం లేదని మండల కేంద్రం వాసులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పనులు మానుకుని ఓహెచ్ఆర్ ట్యాంక్ వద్దకు వచ్చి బిందె నీటి కోసం గంటల తరబడి వేచి ఉంటున్న ఘటనలు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి.

కౌతాళం: మండల కేంద్రంలో 1988 సంవత్సరంలో 6 వేల జనాభా ఉండేది. అప్పట్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో ఓహెచ్ఆర్ ట్యాంకును నిర్మించారు. 10 ఏళ్ల క్రితం కామవరం రస్తాలో 40 వేల లీటర్ల మరో చిన్న ట్యాంకును నిర్మించారు. ప్రస్తుతం మండల కేంద్రం జనాభా 20 లక్షలు. ఇంత జనాభాకు మరో రెండు లక్షల లీటర్ల సామర్థ్యం ట్యాంకులు అవసరం ఉన్నా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా తాగునీటి సమస్య మండల కేంద్రాన్ని వేధిస్తోంది. 15 రోజులకోసారి కుళాయిలకు నీరు సరఫరా అవుతుండటంతో ఆ రోజు ఒకవైపు పండగను తలపిస్తుండగా.. మరోవైపు నీళ్లు పట్టుకునే సమయంలో అక్కడక్కడా ఘర్షణ సన్నివేశాలు చోటుచేసుకుంటున్నాయి.

చెడిపోయిన మోటార్లు

అధికారుల లెక్కల ప్రకారం పదిహేను రోజులకోసారి అంటే రెండు రోజుల క్రితం నీరు కుళాయిలకు సరఫరా కావాల్సి ఉంది. అయితే మోటార్లు చెడిపోవడంతో ఆ రోజు కూడా సరఫరా కాలేదు. దీంతో తాగునీటి సమస్య తీవ్రమైంది. పనులు మానుకుని మండల కేంద్రం వాసులు బిందెలు చేత పట్టుకుని ఓహెచ్ఆర్ ట్యాంక్ వద్దకు క్యూ కడుతున్నారు. అక్కడ కూడా గంటల తరబడి వేచి ఉంటే తప్ప బిందె నీరు దొరకడం గగనమైంది.



తాగునీటి కోసం ఓహెచ్ఆర్ వద్ద గుమిగూడిన జనం

నిర్లక్ష్యంతోనే నీటి సమస్య

నీటి సమస్య పరిష్కారానికి 2009లో రాజనగర్ వద్ద ఎస్ఎస్ ట్యాంకును నిర్మించిన అధికారులు.. అక్కడి నుంచి 20 వేల జనాభా ఉన్న కౌతాళంతో పాటు రాజనగర్ క్యాంపు, లక్ష్మినగర్, బాపురం, వీరాలదిన్నె, డంబలదిన్నె గ్రామాలకు తాగునీరు అందించేందుకు కేవలం 10 హెచ్‌పీ మోటార్(ఎస్ఎస్ ట్యాంక్ వద్ద)ను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇక మరమ్మతులకు గురైతే ప్రత్యామ్నాయంగా ఉంటుందని మరో 10హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేశారు. అయితే చిన్నపాటి ఉరుకుంద, చిరుతపలి కామవరం, ఓబుళాపురం గ్రామాలకు తాగునీరు అందించేందుకు 30 హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేసిన అధికారులు 20 వేల జనాభాకు సరఫరా చేసే మోటారుకు 10 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేయడంతో దాని సామర్థ్యం సరిపోవడం లేదు. నిరంతరాయంగా మోటార్ పనిచేస్తున్నా.. వారానికోసారి సరఫరా చేసేందుకు సరిపడా నీటిని కూడా పంప్ కావడం లేదు. 30 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేస్తామని చెప్పి ఏడాది గడిచినా ఇప్పటి వరకు అతీగతీ లేదు.



కాలిపోయిన 10హెచ్‌పీ మోటార్

ఇంటికెదురుగానే ట్యాంక్ ఉంది



ఓహెచ్ఆర్ ట్యాంకు మా ఇంటి ఎదురుగానే ఉంది. అయిన ఏం లాభం. పదిహేను రోజులకోసారి నీరు వస్తే ఎట్లా పట్టుకోవాలి. మోటార్లు చెడిపోయాయని మొన్న రా వాల్సిన నీళ్లు కూడా రాలేదు. అధికారులు స్పందించి మాకు నీళ్ల సమస్యను పరిష్కరించాలి.

– సొనమ్మ

నీళ్ల కోసం పనికి పోలేదు



నీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియదు. పదిహేను రోజుల క్రితం వచ్చాయి. మళ్లీ రాలేదు. మోటార్లు చెడిపోయాయంటున్నారు. అందుకే వ్యాపారం కోసం పల్లెటూళ్లకు వెళ్లాల్సినవాణ్ని బండి తీసుకుని ఇక్కడికి వచ్చాను. నీళ్ల కోసం పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉంది.

– జంబయ్య, జంగాల కాలనీ

కొట్లాడాల్సిన పరిస్థితి ఉంది



మా వీధిలోనే ఓహెచ్ఆర్ ట్యాంకు ఉంది. అయినా నీళ్ల కోసం ఇబ్బంది ఉంది. కుళాయిలకు నీళ్లు వచ్చినప్పుడు పట్టుకునేందుకు ఒక్కోసారి కొట్లాడాల్సిన పరిస్థితులున్నాయి. ఇంత దారుణమైన పరిస్థితి మా కౌతాళంలో తప్ప ఇంకెక్కడా ఉండదు.

– లక్ష్మి

పల్లెల్లోనే మేలు



మారుమూల పల్లెల్లో నీళ్లు బాగా దొరుకుతాయి. మా కౌతాళంలోనే ఇలాంటి కష్టాల్ని చూస్తున్నాం. కనీసం తాగునీరు కూడా అందించలేక పోతే ఈ ప్రభుత్వాన్ని ఏమనాలి. 15 రోజులకోసారి సరఫరా చేయడం విచారకరం. ఇకనైనా నాలుగు రోజులకోసారైనా నీళ్లు వదిలితే మంచింది.

– రాణి

మరో రెండు ట్యాంకులు కావాలి

కౌతాళం జనాభా పెరిగిపోయింది. 35 ఏళ్ల క్రితం వేసిన పైప్ లైన్ పాతదైంది. కనీసం లక్ష లీటర్ల సామర్థ్యం ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంకులు మరో రెండు కావాలి. 5 ఇంచుల పైప్‌లైన్ వేయాలి. అప్పుడే వారంలో రెండు సార్లు నీళ్లు సరఫరా చేయగలం. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి. గ్రామంలో ఒకటే ఓహెచ్ఆర్ ట్యాంకు ఉండడంతో నీళ్లు ట్యాంకులో పడి పైప్‌లైన్ ద్వారా కుళాయిలకు సరఫరా కావడానికి సమయం తీసుకుంటుంది. అందుకే పది నుంచి 15 రోజుల సమయం పడుతోంది. ట్యాంకులు, పైప్‌లైన్ వచ్చే వరకు సమస్యకు పరిష్కారం కాదు.

– నాగమల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

‘వందనం’ కొందరికే!

- 485 మంది తల్లులకు కోత
- సచివాలయాల చుట్టూ తల్లుల ప్రదక్షిణలు



సచివాలయంలో డబ్బు పడలేదని మొరపెట్టుకుంటున్న మహిళలు

ఉయ్యాలవాడ: తల్లికి వందనం పథకం అభాసుపాలైంది. ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి డబ్బు జమ చేస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారం లోకి వచ్చిన తర్వాత మాట తప్పారు. మండలంలో 2,502 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులు కాగా 485 మంది విద్యార్థులకు కోత విధించారు. వారందరికీ నగదు జమ కాలేదు. ఉయ్యాలవాడకు చెందిన మద్దిరాల మరియమ్మ, మారిగాళ్ల భాగ్యమ్మ, గుల్లకుంట మరియమ్మ, మల్లేశ్వరితోపాటు మరి కొందరు తల్లులు మంగళవారం ఉయ్యాలవాడ గ్రామ సచివాలయానికి చేరుకుని తమకు తల్లికి వందనం డబ్బు పడలేదని, జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని, మరి కొందరు తల్లులు ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉంటే ఒక్కరికి మాత్రమే డబ్బు పడిందని, మిగతా ఇద్దరికి ఎందుకు జమ కాలేదని సచివాలయ సిబ్బందితో మొరపెట్టుకున్నారు. జమ అయిన వారికి కూడా రూ.15 వేలకు బదులు రూ.2 వేలు కోత విధించడంతో కూటమి ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు. రూ.10 వేల కంటే ఎక్కువ ఆదాయం ఉందని, కరెంట్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయని, భూమి ఆన్‌లైన్‌లో 10 ఎకరాల మెట్ట కంటే ఎక్కువగా చూపుతుందని తదితర సాకులతో అర్హుల జాబితాలో తమ పేర్లు లేకుండా చేశారని తల్లులు ఆందోళన వ్యక్తం చేశారు.

మాకుండేది 3.20 ఎకరాలే..



నాకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురికి పెళ్లి చేశాను. రెండో కూతురు వర్షిత ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి వచ్చింది. ఈఏడాది రాలేదు. సచివాలయంలో అధికారులను అడిగితే 12 ఎకరాల మెట్టభూమి ఉందని అనర్హుల జాబితాలో చేర్చారంట. మాకుండేది 3.40 ఎకరాలే.

– మారిగాళ్ల భాగ్యమ్మ, ఉయ్యాలవాడ

చిన్నటేకూరు విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

నీట్‌లో 13 మందికి ఎంబీబీఎస్ సీట్లు

- మరో ఏడుగురికి బీడీఎస్ అవకాశం



డాక్టర్ ఐ.శ్రీదేవి, ఉమ్మడి జిల్లా సమన్వయకర్త

కర్నూలు(అర్బన్): జిల్లాలోని కల్లూరు మండలం చిన్నటేకూరు బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ/మెడికల్ అకాడమీ విద్యార్థులు ఇటీవల విడుదలైన నీట్ 2025, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఐ.శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నీట్ ఫలితాల్లో 20 మంది విద్యార్థులకు మంచి ర్యాంకులు వచ్చాయని, వీరిలో 13 మందికి ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందనున్నారన్నారు. మిగిలిన వారికి బీడీఎస్‌లో సీట్లు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అలాగే జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో మొత్తం 46 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. వీరిలో 31 మంది దేశంలోని ఐఐటీ పాట్నా, భువనేశ్వర్, పాల్కాడ్, గాంధీనగర్, ఎన్ఐటీ కాలికట్, పాట్నా, అగర్తాలా, శిబుపూర్, జైపూర్, రాయపూర్, ఏపీ, దుర్గాపూర్, నాగపూర్, కుండ్లి, జబల్‌పూర్, సీయు బిలాస్‌పూర్, ఢిల్లీ, తేజ్‌పూర్, శ్రీసిటీ(ఐఐఐటీ) ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశం పొందుతున్నారన్నారు. మిగిలిన వారికి ప్రముఖ 10 కళాశాలల్లో ప్రవేశం పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ అకాడమీలో కేవలం గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులే అధిక శాతం ఉన్నారన్నారు. అకాడమీలోని అధ్యాపక బృందం నిరంతర కృషి వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయన్నారు.

చిన్నకోతతో యువకుడికి గుండె ఆపరేషన్



ఆపరేషన్ చేయించుకున్న అక్తర్‌బాషా

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ యువకుడికి చిన్నకోతతో గుండె ఆపరేషన్ చేసి వైద్యులు ప్రాణం పోశారు. ఆపరేషన్ వివరాలను మంగళవారం కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి వివరించారు. ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామానికి చెందిన అక్బర్ బాషాకు ఇటీవల గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లోని పలు ఆసుపత్రులను సంప్రదించాడు. పెద్ద కోతతో బైపాస్ సర్జరీ చేయాలని చెప్పడంతో అతను వెనుదిరిగి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేరాడు. కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో వైద్యులను అన్ని పరీక్షలు నిర్వహించి రక్తనాళాలు పూడుకుపోయి ఉండటంతో బైపాస్ సర్జరీ చేయాలని నిర్ణయించారు. చిన్నకోతతో మైట్రల్ వాల్వ్‌ను మార్చారు. ఇలాంటి ఆపరేషన్‌లు చాలా అరుదని, అందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరింత అరుదుగా చేస్తామని డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

వెల్దుర్తి బీసీ బాలికల హాస్టల్‌కు భలే డిమాండ్

ఇన్‌చార్జ్ కోసం భారీగా పైరవీలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని వెల్దుర్తి బీసీ బాలికల వసతి గృహం సంక్షేమాధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించేందుకు పలువురు వసతి గృహ సంక్షేమాధికారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వీరిలో ఒకరిద్దరు హెచ్‌డబ్ల్యూఓలు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఉద్యోగుల బదిలీల్లో భాగంగా వెల్దుర్తిలో పనిచేస్తున్న రెగ్యులర్ హెచ్‌డబ్ల్యూఓ కర్నూలు కలెక్టరేట్ సమీపంలోని బీసీ బాలికల వసతి గృహానికి బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే క్లియర్ వెకెన్సీగా ఉన్న వెల్దుర్తి బీసీ హాస్టల్ ఇన్‌చార్జ్ కోసం జిల్లాకు చెందిన వారితో పాటు నంద్యాల జిల్లాకు చెందిన హెచ్‌డబ్ల్యూఓలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు సమాచారం. బదిలీల్లో సిఫారసులను పట్టించుకోకుండా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిబంధనల మేరకు సీనియారిటీ ప్రకారం బదిలీలను నిర్వహించడంతో తమకు అన్యాయం జరిగిందని, కనీసం ఇన్‌చార్జ్‌ల్లోనైనా తమకు న్యాయం చేయాలని పలువురు పట్టుబడుతున్నట్లు సమాచారం. అయితే ఎంత మంది పోటీ పడినా, ఎవరి సిఫారసులు వచ్చినా, నిబంధనల ప్రకారం విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ సంబంధిత అధికారులను కోరినట్లు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం 46 ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ బీసీ వసతి గృహాలు ఉండగా, 28 మంది మాత్రమే రెగ్యులర్ వసతి గృహ సంక్షేమాధికారులు ఉన్నారు. మిగిలిన 18 హాస్టళ్లను ఇన్‌చార్జ్‌లకు అప్పగించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే పలు బీసీ వసతి గృహాలకు సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన హెచ్‌డబ్ల్యూఓలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించే అంశం కూడా పరిశీలనలో ఉంది.

ఎవరికి చెప్పుకోవాలో..!

- అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నాలుగవ సచివాలయంలో అధికారులు లేక ఖాళీగా ఉన్న టేబుల్స్

పత్తికొండ: కూటమి ప్రభుత్వంలో అధికారు ల పర్యవేక్షణ లేకపోవడతో సచివాలయ సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటలా తయారైంది. వారు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియడం లేదు. దీంతో వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండి ఎవరికి చెప్పుకోవాలో తెలియక వెనుదిరుగుతున్నారు. పత్తికొండ మండలంలో 14 జిల్లా పరిషత్, బేసిక్ ప్రైమరీ, ప్రైమరీ పాఠశాలలు మొత్తం 45 దాకా ఉన్నాయి. దాదాపు 14వేలు మంది విద్యార్థులు పాఠశాలలో చదువుకుంటున్నారు. అందులో ఈసారి 12,468 విద్యార్థులకు తల్లికి వందనం పథకానికి అర్హులుగా ప్రకటించి 546 మంది విద్యార్థులను అనర్హుల జాబితాలో చేర్చారు. వీరికి ఈనెల 20వ తేదీలోపు సచివాలయాల్లో గ్రివెన్స్ చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. దీంతో అనర్హుల జాబితాలో ఉన్న విద్యార్థుల తల్లులు మంగళవారం సచివాలయాలకు తరలి రాగా అక్కడ ఖాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సచివాలయాలు తెరిచి ఉంచిన సిబ్బంది అందుబాటులో లేకుండాపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల నుంచి వస్తున్నా సచివాలయాల్లో ఎవరూ ఉండటం లేదని పలువురు ఆరోపించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో రైతు మృతి



శ్రీనివాసులు(ఫైల్)

తుగ్గలి: ట్రాక్టర్ ప్రమాదంలో ఓ రైతు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని అమినాబాద్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మోటుపల్లి శ్రీనివాసులు తన పొలంలో ట్రాక్టర్‌తో గుంటిక పాస్తుండగా టైరు రాయి ఎక్కడంతో కింద పడ్డాడు. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ టైరు మీద ఎక్కింది. వెంటనే అతను ఇంటికి ఫోన్ చేసి ప్రమాదం గురించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో జి.ఎర్రగుడి సమీపంలోకి వెళ్లగానే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో పలువురికి పదవులు దక్కాయి. జిల్లాలో కర్నూలు నియోజకవర్గం(ఇద్దరు), ఆలూరు(ఇద్దరు), ఎమ్మిగనూరు(ఇద్దరు), పాణ్యం(ఇద్దరు), పత్తికొండ నియోజకవర్గానికి సంబంధించి ఒకరు చొప్పున ఈ కమిటీల్లో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది.

హోదా	పేరు, నియోజకవర్గం
రాష్ట్ర ఎస్సీ సెల్ జోనల్ అధ్యక్షులు	బి.నారాయణ నాయక్,పత్తికొండ
రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి	వై.వెంకటేశ్వర్లు, పాణ్యం
రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి	ఎరుకలి వెంకటేష్, కర్నూలు
రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం కార్యదర్శి	వి.చంద్రిక,పాణ్యం
రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం కార్యదర్శి	రెడ్డి మంజులత, కర్నూలు
రాష్ట్ర సాంస్కృతిక విభాగం సంయుక్త కార్యదర్శి	కె.ఎం.వీరేశప్ప, ఆలూరు
రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి	ఆర్.కాశీ విశ్వనాథ్, ఎమ్మిగనూరు
రాష్ట్ర సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి	పి.రాజరత్నం, ఎమ్మిగనూరు
రాష్ట్ర సోషల్ మీడియా విభాగం సంయుక్త కార్యదర్శి	బోయ నరేంద్ర, ఆలూరు

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి అనంతపురం మెడికల్ కాలేజీకి బదిలీ

- స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ రాజమండ్రికి..
- కేఎంసీలో 19 మంది వైద్యులకు స్థానచలనం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పూర్వ సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌ఓడి డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలులో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారనే కారణంతో ప్రభుత్వం ఆయనను అనంతపురం మెడికల్ కాలేజీకి బదిలీ చేసింది. ఆయనతో పాటు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్‌ను సైతం రాజమండ్రికి బదిలీ చేశారు. వీరి సేవలను దృష్టిలో ఉంచుకుని కర్నూలులోనే కొనసాగించాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ప్రభుత్వానికి విన్నవించారు. కాగా సోమ, మంగళవారాల్లో జూమ్ ద్వారా నిర్వహించిన బదిలీల్లో కళాశాలలో మొత్తం 19 మంది వైద్యులకు స్థానచలనం కలిగింది. వీరిలో గైనకాలజీ హెచ్‌వోడి డాక్టర్ శ్రీలక్ష్మి అనంతపురానికి, రేడియాలజీ హెచ్‌వోడి డాక్టర్ రాధారాణి తిరుపతికి, పెథాలజి ప్రొఫెసర్ డాక్టర్ రమణబాబు నంద్యాలకు, ఈఎన్‌టి హెచ్‌వోడి డాక్టర్ వీరకుమార్ రాజమండ్రికి బదిలీ అయ్యారు. వీరితో పాటు అసోసియేట్ ప్రొఫెసర్లలో డాక్టర్ ఎం.మల్లికార్జున(పీడియాట్రిక్స్) వైఎస్ఆర్ కడపకు, డాక్టర్ టి.ప్రశాంతి(అనాటమి) కాకినాడకు, డాక్టర్ మాధవీలత(ఫిజియాలజి) అనంతపురానికి, అసిస్టెంట్ ప్రొఫెసర్లలో డాక్టర్ మీనిగ శ్రీనివాసులు(జనరల్ మెడిసిన్), డాక్టర్ పి.స్నేహ, పి.మమత(గైనకాలజి), డాక్టర్ అనురాధ(ఆప్తమాలజి) అనంతపురానికి, డాక్టర్ మన్సూర్‌బాషా(జనరల్ సర్జరి) నంద్యాలకు, డాక్టర్ వి.లత, డాక్టర్ బి.విద్యాసాగర్, డాక్టర్ డి.జాన్సన్ రాజ్‌కుమార్(ఆప్తమాలజి) తిరుపతికి, డాక్టర్ అపర్ణ(అనాటమి), డాక్టర్ మంజుల(అనెస్తీషియా) నంద్యాలకు బదిలీ అయ్యారు.